www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 4 ఏప్రిల్ 2024

5

ఏలూరు



ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అలజడులు సృష్టించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఎన్నికల ప్రవర్తనా నియామావళిని ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండల పరిధిలోని తోటపల్లి, చిన్నాగిరిపల్లి గ్రామాల్లో సాయుధ బలగాలు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో కవాతు నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్రకుమార్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ

పింఛన్.. పరేషాన్..!

- సాయంత్రం వరకూ ప్రారంభం కాని పంపిణీ
- సచివాలయాల చుట్టూ పింఛన్‌దారుల ప్రదక్షిణలు
- మండుటెండలో తల్లడిల్లిన వృద్ధులు
- బ్యాంకులకు సొమ్ము రాకే జాప్యం
- సాయంత్రం నుంచి ముమ్మరంగా పంపిణీ
- 49 శాతం మందికి పింఛన్ అందించినట్లు అధికారుల ప్రకటన


కలిదిండిలో ఆధార్ కార్డులు అందిస్తున్న పింఛనదారులు

జిల్లాలో పింఛన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైంది. అప్పటి వరకూ పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు సచివాలయాల వద్ద బారులు తీరారు. మండుటెండలో గంటలకొద్దీ నిరీక్షించారు. అయితే సొమ్ము రాకపోవడమే పంపిణీలో జాప్యానికి కారణమని సచివాలయ సిబ్బంది తెలిపారు.అనారోగ్యంతో ఉన్నవారికి, వికలాంగులకు బయటకు రాలేని వద్ధులకు ఇండ్ల వద్దకు వెళ్లి పెన్షన్లు ఇవ్వాల్సి ఉండగా కొంతమంది వికలాంగులు సరైన సమాచారం లేకపోవడంతో సచివాలయాల వద్దకు చేరుకున్నారు. వారికి అక్కడున్న సిబ్బంది పింఛన్ సొమ్ము ఇచ్చి పంపించేశారు. జిల్లాలో బుధవారం రాత్రి 8 గంటల వరకు 49 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని అధికారులు ప్రకటించారు. జిల్లాలో 2,70,804 మంది లబ్ధిదారులకుగాను మొదటి రోజు 1,31,018 మందికి సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. పెన్షన్ల పంపిణీ నిమిత్తం రూ.80.92 కోట్లు విడుదలవ్వగా రూ.39.64 కోట్లు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో సామాజిక పెన్షన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుండి ప్రారంభమైంది. పింఛన్లు సచివాలయాల వద్ద ఇస్తుండటంతో మధ్యాహ్నం మండుటెండలో వృద్ధులు చాలా అవస్థలు పడ్డారు. కొంతమంది ఆటోల్లో సచివాలయాలకు వచ్చి పెన్షన్ తీసుకుని తిరిగి ఆటోల్లో ఇళ్లకు వెళ్లారు. దీంతో సుమారు రూ.వంద వరకూ ఆటోలకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోయారు. అనారోగ్యంతో ఉన్నవారికి, వికలాంగులకు, బయటకు రాలేని వృద్ధులకు ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లు ఇవ్వాల్సి ఉండగా కొంతమంది వికలాంగులు సరైన సమాచారం లేకపోవడంతో సచివాలయాల వద్దకు చేరుకున్నారు. స్థానిక మోతేవారితోటలో ఉన్న 12వ నెంబర్ సచివాలయం వద్దకు ఇద్దరు వికలాంగ మహిళలు పెన్షన్ కోసం రావడంతో గమనించిన సచివాలయ సిబ్బంది వెంటనే వారికి పెన్షన్ సొమ్ము ఇచ్చి పంపించారు. 11వ నెంబర్ సచివాలయంలో మధ్యాహ్నం మూడున్నర దాటినప్పటికీ డబ్బు రాకపోవడంతో చాలామంది వేచి చూశారు. తర్వాత సొమ్ము రావడంతో పెన్షన్ల పంపిణీ జరిగింది.


ఆగిరిపల్లిలో..

పోలవరం: మండలంలో పింఛనదారులు సొమ్ము కోసం రోజంతా సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ సాగుతుందని ముందుగానే ప్రచారం జరగడంతో లబ్ధిదారులు తమ సమీప సచివాలయాల వద్దకు బుధవారం ఉదయమే చేరుకున్నారు. మండలంలో 6,836 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. అయితే సొమ్ము పంపిణీ ప్రారంభం కాకపోవడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులు ఆయా సచివాలయాల అరుగులపై, సమీప చెట్ల కింద పడకేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో వైద్య సిబ్బంది వారికి ఒఆర్ఎస్ ద్రావణం, తాగునీరు పంపిణీ చేశారు. బ్యాంకుల్లో నగదు అందుబాటులో లేకపోవడంతో పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతోందని, సొమ్ము అందగానే పంపిణీ ప్రారంభిస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

జంగారెడ్డిగూడెం టౌన్: పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు సచివాలయాల వద్ద బారులు తీరారు. మండుటెండలో గంటలకొద్దీ నిరీక్షించారు. అయితే సొమ్ము రాకపోవడమే పంపిణీలో జాప్యానికి కారణమని సచివాలయ సిబ్బంది తెలిపారు.

ద్వారకాతిరుమల: పింఛన్ సొమ్ము కోసం ద్వారకాతిరుమలలోని సచివాలయాల వద్ద పెద్దసంఖ్యలో లబ్ధిదారులు బుధవారం ఉదయమే చేరుకున్నారు. సొమ్ము రాకపోగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో విలవిల్లాడారు. సాయంత్రం ఐదు గంటలకు బ్యాంకు నుంచి సొమ్ము రాక లబ్ధిదారులు వెనుదిరిగారు. బ్యాంక్ నుండి సొమ్ము రాగానే పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

కలిదిండి: పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు బుధవారం సాయంత్రం వరకూ సచివాలయాల వద్ద పడిగాపులు పడ్డారు. ఎట్టకేలకు సాయంత్రం ఐదు గంటలకు సచివాలయ ఉద్యోగి బ్యాంక్ నుండి డబ్బు తీసుకు రావడంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆగిరిపల్లి: పింఛన్ల పంపిణీ సచివాలయాల వద్ద చేపట్టడంతో వృద్ధులు, వికలాంగులు పలు అవస్థల పాలయ్యారు. ఒక వికలాంగురాలు కాలు, చేయి పనిచేయక నడవలేని స్థితిలో సగ్గ బజారు నుంచి సచివాలయానికి పెన్షన్ కోసం రావడం అందరినీ కలిచివేసింది.


ఏలూరు నగరంలో

ముసునూరు: పింఛన్ కోసం వృద్ధులు, వితంతువులు బుధవారం మండలంలోని 16 గ్రామాల్లో సచివాలయాల వద్ద ఉదయం 7 గంటల నుంచే నిరీక్షించారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి ఇస్తామని సిబ్బంది చెప్పడంతో చాలామంది వెనుదిరిగారు. తర్వాత మండుటెండలో రెండు గంటలకు అంతా సచివాలయాలకు చేరుకున్నారు. అనారోగ్యంగా ఉన్న వారిని సైతం సచివాలయానికి రావాల్సిందేనని సిబ్బంది ఇబ్బంది పెట్టారని పలుచోట్ల విమర్శలు విన్పించాయి.


బుట్టాయగూడెంలో పడిగాపులు

చింతలపూడి: పింఛన్ సొమ్ము కోసం వృద్ధులు, వితంతువులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉదయమే లబ్ధిదారులంతా సచివాలయాలకు చేరుకోగా మధ్యాహ్నం ఒంటిగంటకు సొమ్ము అందక పింఛన్లు ఇవ్వమని సిబ్బంది చెప్పారు. దీంతో వచ్చిన వారంతా వెనుదిరిగి మండుటెండలో మధ్యాహ్నం వేళ సచివాలయాల వద్దకు చేరుకున్నారు. చాలాసేపు నిరీక్షణ అనంతరం మూడు గంటల నుంచి పెన్షన్ల పంపిణీ మొదలుపెట్టారు. దీనిపై రెండు రోజులు మాట్లాడుతూ రాత్రి తొమ్మిది గంటల వరకూ పెన్షన్ల పంపిణీ చేస్తామని చెప్పారు. సాయంత్రం 6:30 గంటల వరకు 25 శాతం పెన్షన్లు పంపిణీ చేశామని వివరించారు.

ముదినేపల్లి: మండల వ్యాప్తంగా బుధవారం పింఛన్ల పంపిణీ ఆలస్యంగా సాగింది. ఉదయమే పెద్దసంఖ్యలో పింఛనదారులు సచివాలయాలకు చేరుకుని పడిగాపులు కాశారు. మధ్యాహ్నం నుండి పింఛన్ల పంపిణీ జరుగుతుందని చెప్పడంతో అంతా ఇక్కడే వేచియున్నారు. మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. మండలవ్యాప్తంగా రూ.2.71 కోట్ల సొమ్ము బ్యాంకు నుంచి డ్రా చేయాల్సి ఉండగా పూర్తిస్థాయిలో సొమ్ము రాక ఒక వంతు మాత్రమే పింఛన్ల పంపిణీ సాగింది. దీంతో వచ్చిన సొమ్మునే సర్దుబాటు చేసి పింఛన్ల పంపిణీ సిబ్బంది నిర్వహించారు. గురువారం పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

బుట్టాయగూడెం: మండలంలో బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకూ పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. అదీ కొంతమందికి మాత్రమే పంపిణీ సాగింది. మిగిలిన వారికి సొమ్ము రాగానే పంపిణీ చేస్తామని, పిలిచినంత వరకూ గురువారానికి పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.


ముదినేపల్లిలో.

తనిఖీలు ముమ్మరం చేయాలి

జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి


తనిఖీలను పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండి తనిఖీలను ముమ్మరం చేయాలని జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. బుధవారం ఆమె పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలవుతున్న క్రమంలో జిల్లా సరిహద్దులతోపాటు పలు ముఖ్యప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జెసి తెలిపారు. స్వాధీన పరచుకున్న నగదును స్ట్రాంగ్‌రూమ్‌లో అప్పగిస్తారన్నారు. నగదు తీసుకెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో పెదపాడు ఎస్ఐ కె.శుభశేకర్, తహశీల్దార్ భావన్నారాయణ, ఎంపిడిఒ తేజరతన్ పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిఐ మురళీకృష్ణ


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వేసవికాలంలో ఆరుబయట నిద్రించే ప్రజలు, బయట ఊళ్ళకు వెళ్లే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, దొంగల బారిన పడకుండా ఉండేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిఐ మురళీకృష్ణ తెలిపారు. వేసవికాలం మరింత పెరుగుతూ ఉండటంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా క్రైమ్ స్టేషన్ పోలీసులు ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా క్రైమ్ సెంట్రల్ స్టేషన్ మురళీకృష్ణ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలు ఆహ్లాదకరమైన గాలి కోసం డాబాలపై నిద్రించే సమయంలో ప్రజలు తమ ఇంటి తలుపులు సరిగ్గా చెక్ చేసుకుని తలుపులు, కిటికీలు కూడా పూర్తిస్థాయిలో బిగించి పెట్టి ఉంచాలని ఆయన సూచించారు. వేసవికాలం చదువులకు ఇండ్లను వదిలి బయటకు వెళ్లే సమయాలలో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, బంగారు వస్తువులను భద్రమైన చోటులో భద్రపరచుకోవాలన్నారు. లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకుని ఊళ్లకు వెళ్లాలని సూచించారు. క్రికెట్ మ్యాచ్ల నేపథ్యంలో యువత ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడి నగదును కోల్పోతున్నారని, దాంతో వారంతా నేరాల బాట పడుతున్నారని, చైన్ స్నాచింగ్‌లు కూడా జరిగే అవకాశాలు ఉన్నందున మహిళలు, యువతులు, విద్యార్థులు ఒంటరిగా బయటకు వెళ్లే సమయాలలో దగ్గ జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని సూచించారు. వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఇంటి బయట పార్క్ చేసి ఉన్న సమయాలలో దొంగతనాలకు గురి కావడం జరగకుండా ఉండాలంటే వాహనాలకు డబుల్ లాక్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. రహదారుల వెంబడి అపరిచిత వ్యక్తులు ద్విచక్ర వాహనాలను ఆపి నేరాలకు పాల్పడుతూ ఉంటారని, అపరిచిత వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వరాదని ఆయన తెలిపారు. మరీ ముఖ్యంగా ఇండ్లను వదిలి ఊళ్లకి వెళ్లే సమయాలలో తమ సోషల్ అకౌంట్ ద్వారా తాము బయటకు వెళ్తున్నట్లు పోస్టులు పెట్టరాదన్నారు. వేసవికాలం సెలవులకు బయటకు వెళ్లే సమయాలలో పోలీస్ స్టేషన్‌లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా ప్రత్యేక సర్వే లైన్స్ ఏర్పాటు చేస్తామని, ముందుగానే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో హుండీ దొంగతనాలు జరుగుతున్నాయని, ఆలయాలు ఏర్పాటు చేసే సమయంలో ఆలయాల ధర్మకర్తలు హుండీలను బలంగా భూమిలో పాతి ఉంచే ప్రయత్నాలు చేయాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఇచ్చిన ఆదేశాల మేరకు నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మురళీకృష్ణ తెలిపారు. ఎవరికైనా ఏదైనా అనుమానం వచ్చినట్లయితే వెంటనే సెంట్రల్ క్రైమ్ స్టేషన్ 0881223318 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని కూడా ఆయన కోరారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా రక్త మార్పిడి కేంద్రంలో బుధవారం పది మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాధారణంగా తలసేమియా చిన్నారులకు నెలకు రెండు నుంచి మూడుసార్లు రక్తమార్పిడి చేయించుకోవలసి ఉంటుందని, కాని కొంతమందికి తగినంత హిమోగ్లోబిన్ పెరగటం లేదని, అందువల్ల వారికి తరచుగా రక్త మార్పిడి చేస్తున్నామని అన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడం వల్ల మాత్రమే వారిని ఆదుకోగలమని తెలిపారు. తలసేమియా చిన్నారులతోపాటు వారి సహాయకులకు 30 మందికి ఉచిత భోజనాన్ని లయన్స్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాకరాల వేణు బాబు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ వర ప్రసాదరావు, డాక్టర్ పిఎఆర్ఎస్.శ్రీనివాసరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, మానవతా సభ్యులు అడుసుమిల్లి నిర్మల, రత్నాకర్ రావు పాల్గొన్నారు.


చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యులు

కొనసాగిన 'పది' మూల్యాంకనం

ఏలూరు సిటీ: పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం బుధవారం మూడవ రోజు 39.6 శాతానికి చేరుకుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఏలూరు నగరంలోని సెంట్ జేవియర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల పేపర్ల మూల్యాంకనం మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుందని అన్నారు. సిబ్బంది 1020 మందికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించటం జరిగిందని విద్యాశాఖ అధికారి అబ్రహం తెలిపారు.

మలేరియా నివారణకు కృషి చేయాలి

జోనల్ ఎడి బిఎల్ఎన్.కుమార్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా వ్యాధి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాజమండ్రి జోనల్ అడిషనల్ అధికారి(ఎడి) బిఎల్ఎన్.కుమార్ సిబ్బందికి ఆదేశించారు. బుధవారం జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో మలేరియా కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మలేరియా కిట్లను, ల్యాబ్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా పట్ల నిర్లక్ష్యంగా వుండవద్దని, సీజనల్ ప్రారంభానికి ముందే ఏజెన్సీ ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో, నిర్వాసిత గ్రామల్లో, వసతి గృహాల్లో ఎప్పటికప్పుడు దోమల మందును పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం గత కొంతకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ రెగ్యులర్ అయిన ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రవి శేఖర్, వైద్యధికారిణి బి.గాయత్రి, సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు, ఫార్మసిస్ట్ నాగేశ్వరావు, సిహెచ్ఒ.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న కుమార్

నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నగదు పట్టివేత

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను, ఆగడాల లంక రోడ్డులో పరిమితికి మించి తీసుకు వెళుతున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల కోడ్ భీమడోలు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎ.మాధవరావు తెలిపారు. ఏలూరుకు చెందిన సరెళ్ళ రామకృష్ణ తన కారులో ఏలూరు నుంచి ఆగడాలలంక వెళుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం గుండుగొలను ఆగడాలలంక రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం కారులో సరైన పత్రాలు లేకుండా రూ.లక్ష నగదు ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల మేరకు వాటిని స్వాధీన పరచుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ బందం తెలిపింది.

జీలుగుమిల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీలుగుమిల్లి సరిహద్దులో ఏర్పాటు చేసిన ఎన్నికల తనిఖీ కేంద్రం వద్ద రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు చెక్‌పోస్ట్ ఇన్‌ఛార్జి నిఖిల్ మధు శరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా అశ్వారావుపేట నుంచి మక్కినవారి గూడెం వెళ్తున్న కార్‌లో ఎమ్.విజయకృష్ణ రూ.లక్ష నగదును గుర్తించినట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎటువంటి రశీదులు లేకపోవడంతో కేసు నమోదు చేసి ఖజానా కార్యాలయానికి తరలించామన్నారు. ఈ తనిఖీల్లో విఆర్ఒలు రెహ్మాన్, పాషా, కానిస్టేబుళ్లు సుధాకర్, శ్రీను, చెక్‌పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి: తగిన ఆధారాలతో మాత్రమే నగదు పట్టుకు వెళ్లాలని కామవరపుకోట తహశీల్దార్ గోపాలకృష్ణ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలలో రూ.50 వేలకు మించి తీసుకువెళ్లకూడదని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా, కంటైనర్ తనిఖీలు చేస్తుండగా రూ.2,84,220 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా అదే చెక్‌పోస్ట్ వద్ద రూ.70 వేలు ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ అమౌంట్‌ను జిల్లా ట్రెజరీలో రిపోర్టు రాసి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చెక్‌పోస్ట్ టీం మల్లిక జరీనా షేక్, మునిధర్ కానిస్టేబుల్, శ్యామ్ పాల్గొన్నారు.


భీమడోలు : నగదును స్వాధీనం చేసుకుంటున్న ఫ్లయింగ్ స్క్వాడ్

కామవరపుకోట: కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్‌లో ఎన్నికల అధికారి ఎమ్‌డీ మోహిద్దీన్ ఆధ్వర్యంలో జరిపిన వాహనాల తనిఖీల్లో ఉంగుటూరు మండలం నల్లమాడుకి చెందిన వ్యక్తి రూ.లక్ష ఆరువేల నగదు తీసుకువెళుతుండగా పట్టుకున్నట్లు తహశీల్దార్ తెలిపారు. నగదుకు సరిపడా పత్రాలను ఏలూరు ఎన్నికల ట్రెజరీ కార్యాలయంలో చూపించినట్లయితే నగదుకు సంబంధించిన వ్యక్తికి నగదు ఇవ్వటం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలలో రూ.50 వేలకు మించి తీసుకువెళ్లకూడదని, తగిన ఆధారాలతో మాత్రమే నగదు పట్టుకువెళ్లాలని తహశీల్దార్ జెవిఆర్.రమేష్ సూచించారు. వాహనాల తనిఖీలలో విఆర్ఒ బాబురావు, పోలీసు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ కె.రమేష్, జి.సూర్యరావు, ఎం.నాగార్జున, నాగూర్ సాహెబ్ పాల్గొన్నారు.


జీలుగుమిల్లి: పట్టుకున్న నగదుతో పోలీసులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

విద్యార్థులకు నాసిరకం భోజనం అందిస్తూ వాళ్ల ఆరోగ్యాలతో ఆడుకుంటున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒకి వినతిని అందించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం.వెంకట్రాజు అధ్యక్షత వహించగా సూర్యకిరణ్ మాట్లాడుతూ లక్షల రూపాయలు కాంట్రాక్ట్ చేస్తూ ప్రభుత్వ హాస్టల్స్‌కు, ఏజెన్సీ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు కూరగాయలు, గుడ్లు, చికెన్, నాణ్యతలేని సరుకులు అందిస్తున్న జంగారెడ్డిగూడెంకి చెందిన కూరగాయల కాంట్రాక్టర్ పెనుమత్స రాజుపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీలుగుమిల్లి మండలం ఆశ్రమ పాఠశాలలో ఆదివారం హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులకు రెండు రోజులు క్రితం వండిన చికెన్ కూరతో పెట్టడం వల్ల విద్యార్థులకు మరుసటి రోజు ఫుడ్ పాయిజన్ అయ్యిందన్నారు. విద్యార్థులకు కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు అవ్వడంతో హాస్పిటల్లో వారం రోజులు పాటు వైద్యం చేయించుకుని బయటపడటం జరిగిందన్నారు. దీనికి కారణం నిల్వ ఉంచిన ఆహారపదార్థాలు పెట్టడమే అన్నారు. ఈ విషయం స్వయంగా పిల్లల తల్లిదండ్రులు తెలిపారన్నారు. స్వయానా డిఎంహెచ్ఒ తనిఖీ చేసి నిల్వ ఉంచిన సరుకులు, కూరగాయలతో వండటంతో ఇలాగే ఫుడ్ పాయిజన్ అవుతుందని తేల్చారన్నారు. కనుక ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన సరుకులు అందించకుండా వాడిపోయిన, కుళ్లిపోయిన కూరగాయలు, పప్పులు, గుడ్లు, చికెన్ తదితర సరుకులు అందిస్తున్న జంగారెడ్డిగూడెంకి చెందిన కూరగాయల సరుకుల కాంట్రాక్టర్ పెనుమచ్చ రాజు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని, కాంట్రాక్ట్ రద్దు చేయాలని, మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

పెత్తందారుల వల్లే బయటకు వచ్చా: ఎలిజా

జంగారెడ్డిగూడెం టౌన్: అధికార పార్టీలోని కొంతమంది పెత్తందారుల వల్లే పార్టీ నుంచి బయటకు రావలసిన పరిస్థితి వచ్చిందని చింతలపూడి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజ అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీలోని పెత్తందారుల వల్ల ఆ పార్టీలోని నాయకులు రాజీనామాకు సిద్ధం అయ్యారన్నారు. రెండు రోజుల్లో లింగపాలెం మండలం ధర్మాజీ గూడెం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో లౌకికవాదం కనబడిందని, అది వైసిపిలో కనపడలేదన్నారు. ప్రస్తుతం అధికారం కోసం వచ్చే వాళ్లందరూ బయట నుంచి వచ్చిన వాళ్లేనని, తాను గత ఆరు సంవత్సరాలుగా ఇదే నియోజకవర్గంలో ఉన్న ప్రతి ప్రతి కుటుంబానికి పరిచయస్తుడునన్నారు. ఈ నియోజకవర్గంపై నాకు పూర్తి అవగాహన ఉందని, అందర్నీ కలుపుకొని ప్రచార కార్యక్రమాన్ని ముందుకు సాగించి, గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. తనకు సహకరించాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధికి మళ్లీ వైసిపిని గెలిపించాలి

ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

గ్రామాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి చూసి వైసిపిని మళ్లీ గెలిపించాలని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. కంతంగూడెం, యర్రంపేట పంచాయతీలలో ఎన్నికల ప్రచార ర్యాలీలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఎంపిపి, జెడ్‌పిటిసి, గ్రామ కన్వీనర్లు, సర్పంచులు వారితో ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో జగన్ కుట్ర

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పింఛన్ పంపిణీ విషయంలో ప్రతిపక్షాలు అడ్డుకున్నారని నమ్మించ కల్పించేందుకు లబ్ధిదారులను సచివాలయాలకు రప్పించి ఇబ్బందులకు గురిచేయడం సిఎం జగన్ శాడిజానికి పరాకాష్ట అని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఏలూరు పవర్ పేటలోని టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి, జనసేన, కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ అనంతరం టిడిపి నియోజకవర్గ అభ్యర్థి బడేటి చంటి మాట్లాడుతూ వాలంటీర్లతో ఓటర్లను భయపెట్టాలని జగన్ చేసిన కుట్రలను ఎన్నికల కమిషన్ అడ్డుకోవడంతో కూటమిపై నింద వేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వైసిపి చేసిన అరాచక పాలన అకృత్యాలను ప్రజలు తీవ్రంగా పరిగణిస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరినీ కలుపుకుని ముందుకెళ్తా

కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

కాంగ్రెస్ మేనిఫెస్టోని ప్రజల వద్దకు తీసుకు వెళ్లాలని కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా అన్నారు. చింతలపూడి పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎలక్షన్ కార్యాచరణపై కార్యకర్తలతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు వెళ్తాం, ఎవరికి దక్కాల్సిన గౌరవం వారికి దక్కుతుందని తెలిపారు. బలంగా పనిచేయాలని, ప్రతి కార్యకర్త మనకు కావాలని, కాంగ్రెస్ అభిమానులు ఉన్నారని, వారి ఓట్లు మనకే పడే విధంగా చేయాలని అన్నారు. పొత్తులు నచ్చని వారి ఓట్లు, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్‌కే పడతాయన్నారు. ప్రతి ఓటర్ని కలవాలి, ప్రతి గడపకు వెళ్లాలని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రచారానికి తెలంగాణ కాంగ్రెస్ మంత్రులు వస్తారని, ఆదివారంలో ప్రచారానికి తెలంగాణ మంత్రి సీతక్క వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'సురేష్ కుమార్ మృతి ఉద్యోగ సంఘాలకు తీరని లోటు'


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ ఏలూరు తాలూకా సంయుక్త కార్యదర్శి గోడి సురేష్ కుమార్ మృతి ఉద్యోగ సంఘాలకు, ఉద్యమాలకు తీరని లోటు అని ఏపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ నాయకులు చోడగిరి శ్రీనివాస్, ఆర్‌ఎస్.హరినాథ్ అన్నారు. బుధవారం ఉదయం అనారోగ్య కారణాలతో మృతి చెందిన సురేష్ కుమార్ భౌతికదేహాన్ని స్థానిక వెన్నెవల్లి వారి పేటలోని ఆయన స్వగృహంలో ఏపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ నాయకులు సందర్శించి, జెండాను సురేష్ కుమార్ పార్థీవ దేహంపై ఉంచి ఘన నివాళులు అర్పించారు. సురేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నాయకులు నెరుసు రామారావు, శ్రీధర్ రాజు, పూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళిత వ్యవసాయ కార్మికులను విడుదల చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అల్లంచర్లరాజుపాలెం గ్రామంలో ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్న దళిత వ్యవసాయ కార్మికులను వెంటనే విడుదల చేయాలని సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్ రాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని అల్లంచర్లరాజుపాలెం గ్రామంలో వందల ఎకరాల అటవీ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్న రాజకీయ పలుకుబడి గల పెత్తందారుల జోలికి వెళ్లకుండా రోజువారీ కూలీ పనికి వెళుతున్న కామవరపుకోట పరిధిలోని కొండ గూడెంకి చెందిన వ్యవసాయ కూలీలను బెదిరించి, అదుపులోకి తీసుకున్న అటవీ శాఖ అధికారుల ఏకపక్ష వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. అనేక సంవత్సరాలుగా అటవీ భూముల్లో తిష్ట వేసుకుని తమ సొంత భూముల మాదిరిగా క్రయవిక్రయాలు సాగిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పొట్టకూటి కోసం కూలీ పనికి వెళ్లిన దళిత వ్యవసాయ కూలీలను ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకోవడం సరికాదని ఆయన హితవు పలికారు. అదుపులోకి తీసుకున్న దళిత వ్యవసాయ కార్మికులను వెంటనే విడుదల చేయాలని అటవీశాఖ అధికారులను ఆయన డిమాండ్ చేశారు.



ప్రచారం నిర్వహిస్తున్న స్వాతి

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతివ్వండి : స్వాతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్న సంక్షేమ ప్రభుత్వానికి మరోమారు మద్దతివ్వాలని కైకలూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మినంపాడులో వైసిపి శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వైసిపి ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, లేళ్ల ఆంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిడి లేకుంటేనే అభివృద్ధి

మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేకుండా ఉండే వ్యక్తికి అధికారం వస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యం అవుతుందని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ముసునూరు మండలంలోని రమణక్కపేట, సూరేపల్లి, అక్కిరెడ్డిగూడెం గ్రామాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో రమణక్కపేట నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలు నేటికీ కనీస మౌలిక వసతులు తాగునీరు, వీధి దీపాలు, రహదారులు వంటివి కూడా పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. రమణక్కపేటలో ఏడు దశాబ్దాలుగా రెవెన్యూ ఫారెస్ట్ బోర్డర్ సమస్యతో రైతులు తమ పంట పొలాలకు హక్కు పత్రాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటన్నిటికీ పరిష్కారం దొరకాలంటే ఎటువంటి రాజకీయ ఒత్తిడికి తావులేని ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నూజివీడు నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగా ఎన్నిక కావాలన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

భీమడోలు : ఏలూరు కాలువలో స్నానానికి దిగి, ప్రమాదవశాత్తు మునిగి పొలసానిపల్లికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందారు. భీమడోలు పోలీసుల కథనం మేరకు పొలసానిపల్లికి చెందిన దవులూరి శ్రీను(48) జాతీయ రహదారి పక్కన గల భీమడోలు శివాలయం వద్ద స్నానం చేసేందుకు కాలువలో బుధవారం సాయంత్రం దిగారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు కాలువలోకి జారి చనిపోయినట్లు ఆయన కుటుంబ సభ్యులు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

యుజి పిహెచ్‌సి నుంచి పిహెచ్‌సికు..

30 పడకల ఆసుపత్రి కాస్తా ఆరు పడకలుగా మార్చిన వైనం

50 పడకల ఆసుపత్రిగా మార్చాలని మండల ప్రజలు వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి ప్రైమరీ హెల్త్ సెంటర్‌గా డి గ్రేడ్ అయ్యింది. 30 పడకల ఆసుపత్రి కాస్త ఆరు పడకల ఆసుపత్రిగా మార్చారు. 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా మారుస్తామని గతంలో కాంగ్రెస్, టిడిపి హామీ ఇచ్చింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెం మండలానికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. 2006 ఆగస్ట్‌లో జిఒ 378 ద్వారా వర్గోన్నతి అయినా, అధికారుల చర్యలు మాత్రం శూన్యం. 2016లో 30 పడకల ఉన్నత స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సిహెచ్‌సి) అప్ గ్రేడ్ చేసి, అక్కడ 24 గంటలు ప్రజలకు వైద్య సేవలు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ధర్నాలు చేశాయి. 1959లో పంచాయతీ సమితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ప్రారంభమైన ఈ ఆసుపత్రి 1978లో వర్గోన్నతి పొంది 30 పడకల ఉన్నతస్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఔన్నత్యం సాధించింది. 2006 ఆగస్టు 11వ తేదీన అప్పటి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కొయ్యలగూడెం 30 పడకల(యుజి పిహెచ్‌సి)కి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాయిని కల్పిస్తూ జిఒ నెంబర్ 378ను జారీ చేశారు. ఈ ఆసుపత్రికి ఆనాడు డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టు, హెడ్ నర్స్, స్టాప్ నర్సు, ఎఎన్ఎం, నర్సింగ్ ఆర్డర్ పోస్టు మంజూరయ్యాయి.

2001 జనవరిలో యుజి పిహెచ్‌సికి సివిల్ సర్జన్ స్పెషలిస్ట్, గైనకాలజి పోస్టు మంజూరైంది. అప్పటి నుంచి 2006 వరకు ఇక్కడ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ వైద్య అధికారులు విధులు నిర్వహించి ఎన్నో శాస్త్ర చికిత్సలు నిర్వహించారు. 2006 నుంచి సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ వైద్య అధికారి పోస్ట్ భర్తీ చేయకపోవడం వల్ల ఇక్కడ శాస్త్ర చికిత్సలు జరగడం లేదు. శస్త్ర చికిత్సల కోసం ఇతర



యుజి పిహెచ్‌సి భవనం



నూతనంగా నిర్మించిన పిహెచ్‌సి భవనం

ప్రాంతాలకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం ఆసుపత్రికి 150 వరకు పేషెంట్లు వైద్య చికిత్స కోసం వస్తారు. వివిధ శస్త్ర చికిత్సల కోసం ఇక్కడి వైద్యాధికారులు రోగులును జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాలకు పంపుతున్నారు.

మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 75.694 మంది ఉన్నారు. ఇంత జనాభాకి 30 పడకల ఆసుపత్రి ఏమాత్రం సరిపోదని వివిధ వైద్య నిపుణులు కూడా అవసరం పడుతుందని 50 నుంచి 100 పడకలకు మార్చాలన్న ప్రతిపాదన కూడా ప్రభుత్వం ముందు ఉంది. 2019లో కోవిడ్-19 దేశ ఆరోగ్య వ్యవస్థను ప్రశ్నార్థకంలో పడేసింది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ లెక్కల ప్రకారం వెయ్యి మందికి కూడా ఒక్క డాక్టర్ లేని పరిస్థితి భారతదేశంలో ఉందని స్పష్టంగా తెలియజేసింది. కరోనా రాక ముందు మునుపు భారతదేశంలో హాస్పటల్ ప్రాధాన్యతను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఉన్న ప్రభుత్వాలకి దేశ ప్రజల మరణాల ద్వారా బుద్ధి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కరోనా అంత గుణపాఠం చెప్పినా పాలకులలో స్పందన రాకపోగా ప్రతిపక్షాలు కూడా వారి మీద వీరు, వీరు మీద వారు ఆరోపణలు చేసుకోడానికి మాత్రమే సమయాన్ని వెచ్చిస్తున్నారు.

కొయ్యలగూడెంలో అనేక సమస్యలు ఉన్న దానిపై ఎవరు స్పందిస్తున్న పాపాన పోలేదు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 50 పడకల నుంచి 100 పడకలకు పెంచగలిగితే మండలంలో అనేక మంది పేద ప్రజల ఆరోగ్య సమస్యలు తీరినట్టు అవుతుంది. కనీసం 50 పడకల ఆసుపత్రిగా మారిన అనేకమంది శస్త్ర చికిత్స సర్జన్లు ఇక్కడ 24 గంటలు అందుబాటులో ఉంటారు.

ప్రయివేట్ ఆసుపత్రుల దోపిడీ: చుట్టు పక్కల గ్రామాలలో ఉన్న పేద ప్రజలు నాణ్యమైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొంది. రోజు కూలీకి వెళ్తే కాని డొక్కాడని దుస్థితి. అలాంటి వారు ఖరీదైన వైద్యం ఎలా చేయించుకోగలరు. ఆరోగ్య శ్రీ లాంటి పథకాలు అమలు చేస్తున్న వాటిలో అనేక లోపాలు ఉన్నాయి. రూ.వెయ్యి దాటితే వైద్యం ఉచితంగా మొదలవుతుందని ప్రభుత్వం చెబుతున్నా అది క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఏదైనా రోగం వచ్చి ప్రయివేటు హాస్పిటల్స్‌కు వెళ్లంటే నిలువునా దోచేస్తున్నారు.

ఎన్నికల తర్వాత నూతనంగా ఏర్పడే ప్రభుత్వమైన 50 పడకల ఆసుపత్రి మీద దృష్టి పెట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐటిడిఎ డిప్యూటి డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తాటియాకులగూడెంలో జరుగుతున్న కుటుంబ వైద్య శిబిరాన్ని(ఎఫ్‌డిసి) ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శిబిరానికి వస్తున్న వారి నుంచి సిబ్బంది అందిస్తున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బ తగలకుండా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు అయిదేళ్ల లోపు పిల్లలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వడదెబ్బను ఎదుర్కొనేందుకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఒఆర్ఎస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని బి.గాయత్రి, సిహెచ్ఒ.శ్రీనివాసరాజు, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, 104 సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

బిసిల అభివృద్ధే టిడిపి మొదటి ప్రాధాన్యత

జయహో బిసి కార్యక్రమంలో టిడిపి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

జనాభాలో సగభాగంగా ఉన్న బిసిలను అన్ని రంగాల్లోనూ వారికి సగం వాటా కల్పించేలా, ఆయా రంగాల్లో వారిని ముందు భాగాన నిలిపేందుకు టిడిపి బాధ్యత తీసుకుందని టిడిపి ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో జయహో బిసి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల్లో రాజకీయ చైతన్యాన్ని తీసుకురావడమే కాక వారికి రాజకీయ అధికారాలను కల్పించింది కూడా టిడిపినేనని చెప్పారు. బిసిల నాయకత్వాన్ని తయారు చేసే ఫ్యాక్టరీ, యూనివర్శిటీ టిడిపినేనన్నారు. టిడిపిని ఏర్పాటు చేసిన నాటి నుంచి బిసిలు పార్టీకి అండదండగా ఉన్నారని, ప్రాణాలను ఫణంగా పెట్టి పార్టీని రక్షించుకున్నారని, వారి రుణం తాను ఎన్నటికీ తీర్చుకోలేమని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే వెనుకబడిన కులాలవారికి 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని, పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచుతామని చంద్రబాబు ప్రకటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి అధికార ప్రతినిధి దాసరి శేషు, మాజీ ఎంఎల్ఎ గంటా మురళీకృష్ణ, మాజీ ఎఎంసి జగ్గవరపు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కైకలూరు

18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని కళాకారుల బృందం గ్రామాల్లో అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని కొల్లేరు లంక గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటు అనేది భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన ఒక హక్కు, ఆ హక్కుని ప్రతిఒక్కరూ కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. మనం వేసే ఓటు ఐదేళ్ల మన భవిష్యత్తుతో పాటు రాబోయే తరాల వారి భవిష్యత్తును కూడా నిర్ణయిస్తుందని తెలిపారు. అందుకే ప్రలోభాలకు లొంగవద్దు ప్రాణ సమానమైన ఓటును అమ్ముకోవద్దు అన్నారు. రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కు ఓటు హక్కు 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని తెలిపారు.

జగన్‌ను కలిసిన అశోక్ కుమార్

కామవరపుకోట: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మండలంలోని కెఎస్.రామవరంకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు, చింతలపూడి మాజీ ఎఎంసి ఛైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. చింతలపూడి నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితుల గురించి సిఎం జగన్‌కు ఆయన వివరించారు. చింతలపూడి నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రిని సూచించినట్లు తెలిపారు.

మీడియా ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఎన్నికల రిటర్నింగు అధికారి ఎస్‌కెఎన్ ఖాజావలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిని మీడియా కూడా పాటించాలని ఉంగుటూరు రిటర్నింగు అధికారి ఎస్‌కెఎన్ ఖాజావలి అన్నారు. బుధవారం ఉంగుటూరు ఆర్ఒ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. పెయిడ్ ఆర్టికల్ న్యూస్, సరోగసి అడ్వర్‌టైజ్‌మెంట్స్ వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆర్ఒ వివరించారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో అసత్యాలు ప్రచారం చేయడం నేరమన్నారు. బ్రేకింగ్ న్యూస్ వేసే ముందు సంబంధిత అధికారుల వివరణ, వాస్తవ నిర్ధారణ తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల యాడ్‌లను పత్రికల్లో వేయాలంటే ప్రీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్న మూడు రోజుల తరువాత అనుమతి వస్తుందని, అలా అనుమతి ఉన్న వారికే పత్రికల్లో అడ్వర్‌టైజ్‌మెంట్ వేసుకోవచ్చని వివరించారు. నిడమర్రు, భీమడోలు సిఐలు ఎంవి.సుభాష్, బిబి.రవికుమార్, నాలుగు మండలాల ఎఐఆర్ఒలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఖాజావలి

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - భీమడోలు

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల స్థాయి అంచనా, ఇతర అంశాల ఆధారంగా వారి స్థితి గుర్తించి వారికి గ్రేడింగ్ ఇవ్వడం ద్వారా మరింత సమర్థవంతంగా అంగన్వాడీ కేంద్రం సేవలు అందించే అవకాశం ఉందని స్వచ్ఛంద సంస్థ ఐటిసి ప్రథమ్ కార్యక్రమ పర్యవేక్షకులు టి.శ్రీనివాస్ తెలిపారు. హబ్ అంగన్వాడీ కేంద్రంగా గుర్తింపు పొందిన గుండుగొలను సెక్టార్ పరిధిలోని నెంబర్ 23 అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త బి.రాజామణి, సెక్టార్ పర్యవేక్షకులు ఎం.కవిత అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, వారి తల్లిదండ్రులతో సమావేశమైన ప్రథమ్ పర్యవేక్షకులు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని 87 అంగన్వాడీ కేంద్రాలు హబ్ అంగన్వాడీ కేంద్రాలుగా గుర్తింపు పొందాయన్నారు. ఈ కేంద్రాలకు వచ్చే పిల్లల స్థాయి అంచనా, వారి స్థితులు పరిశీలించేందుకు పర్యటిస్తున్నామన్నారు. ఇదే క్రమంలో అంగన్వాడీ కేంద్రం కార్యకర్త ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో ఒక గ్రూపు ఏర్పాటుకు సిఫార్సు చేశామన్నారు. దీని ద్వారా పిల్లల వివిధ దశల ప్రగతి, ఇతర అంశాల గురించి గ్రూపులో చర్చించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. గ్రూపు ద్వారా అంగన్వాడీ కేంద్రం నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి వారికి తెలియజేస్తామని తెలిపారు. స్థానిక అంగన్వాడీ కేంద్రం అందజేస్తున్న సేవలు ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉన్నాయని అన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్

దేవాదాయ ఇఒ సత్యనారాయణను సస్పెండ్ చేయాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖలో అక్రమంగా ప్రమోషన్ పొందిన ఐనవిల్లి ఇఒ సత్యనారాయణ రాజుని సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం ప్రజాసంఘాల కార్యాలయంలో ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేవాదయ ధర్మదాయ శాఖలో అక్రమ ప్రమోషన్‌ల వ్యవహారంపై నిజా నిజాలు బయట పెట్టాలన్నారు. సీనియారిటీ లిస్టు ఖాతర్ చేయకుండా, జిఒ 888ను అమలు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ప్రమోషన్ ఇవ్వడాన్ని డివైఎఫ్ఐ ఖండిస్తుందన్నారు. అర్ధరాత్రి ప్రమోషన్లపై సమగ్ర విచారణ జరపాలని, అంతవరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న అయినవల్లి ఇఒ సత్యనారాయణను సస్పెండ్ చేయాలన్నారు. హైకోర్టు స్వయంగా సత్యనారాయణ రాజు ప్రమోషన్ అక్రమాన్ని తేల్చిన తర్వాత కొనసాగించడం సరికాదన్నారు. సత్యనారాయణ రాజును విచారిస్తే అక్రమ ప్రమోషన్ల విషయంలో వెనకాల ఉన్న పెద్దల పేర్లు బయటికి వస్తాయన్నారు. దీనికి దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనరేట్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమ ప్రమోషన్ల వ్యవహారంలో సీనియారిటీ ఉన్న ఉద్యోగులు, దశాబ్ద కాలంగా పనిచేస్తున్న చిన్న ఉద్యోగులకు నష్టం కలుగుతుందని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో నిరంతరం నిరుద్యోగుల సమస్యలపై ప్రజారక్షణకై పనిచేస్తున్న భారత ప్రజాతంత్ర యోజన సమైక్య(డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

బార్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్బినేని విజయకుమార్

ప్రజాశక్తి - ఏలూరు

ఆల్ ఇండియా లాయర్ యూనియన్ నిర్వహించే క్లాసులకు జూనియర్ న్యాయవాదులు హాజరై వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్బినేని విజయకుమార్ అన్నారు. బుధవారం ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే తరగతుల కరపత్రాన్ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా అబ్బినేని విజయకుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని, ఈ ప్రొఫెషనల్ తరగతులను అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.రామగోపాల్, ఎపి బార్ కౌన్సిల్ మెంబర్ బివి.కృష్ణారెడ్డి, ఏలూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఎం.నాగరాజు, ఐలూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్, ఎపి హైకోర్టు ఐలు కమిటీ అధ్యక్షులు నర్రా శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది జి.రోనాల్డ్ రాజు, ఐలు జిల్లా అధ్యక్షురాలు వి.శైలజ, కార్యదర్శి కామన మునిస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ వీడియో గ్రాఫర్ నాగరాజు తొలగింపు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గం ఫ్లైయింగ్ స్క్వాడ్ వీడియో గ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్న పామర్తి నాగరాజును ఈనెల 2వ తేదీ నుంచి విధుల నుంచి తొలగించినట్లుగా దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

70 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తా: చిర్రి


ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గంలో 70 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని జనసేన పోలవరం నియోజకవర్గ అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. మండలంలో బుధవారం టి.నరసాపురం, బంధంచర్ల, కేతవరం, రాజుపోతేపల్లి, తెడ్లెం, అల్లంచర్లరాజుపాలెం తదితర గ్రామాల్లో జనసేన ఆధ్వర్యంలో బాలరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలత స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత అంతా కూడా టిడిపి, జనసేన కూటమి వైపే ఉన్నారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, మహిళలందరూ కూటమి అభ్యర్థులను గెలిపిస్తారన్నారు. నాలుగుసార్లు ఎంఎల్ఎగా గెలిచిన బాలరాజు నియోజకవర్గానికి ఏమీ చేయలేదన్నారు. బాలరాజు ఓడిపోతానని వచ్చిన సమాచారం మేరకు తన భార్యను ఎన్నికల్లో నిలబెడుతున్నాడన్నారు. ఎవరు నిలబడ్డా తన గెలుపు ఖాయమన్నారు. గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా నాయకులు కరాటం సాయి, గడ్డమడుగు రవికుమార్, మండల నాయకులు అడపా నాగరాజు పాల్గొన్నారు.

రావికంపాడులో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల వినూత్న ప్రచారం

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సమాజ సేవలో భాగంగా ఎన్నికలు, ఓటు ప్రాధాన్యత, విలువల గురించి ప్రజలలో చైతన్యం తీసుకొస్తున్నారు. ఓటు వజ్రాయుధం, విలువైనది, అమ్ముకోవద్దని, కులం కాదు గుణం చూసి ఓటు వేయాలని, ప్రజాస్వామ్యం కాపాడాలని, ప్రలోభాలకు లొంగకూడదని ఇంటింటికీ తిరిగి చైతన్యం తీసుకొస్తున్నారు. స్కౌట్ మాస్టర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రజలు, ఉపాధ్యాయులు, మంచి సమాజం కోసం వారు చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు.



అబ్బయ్య చౌదరిని సత్కరిస్తున్న నాయకులు

సంక్షేమాభివృద్ధితో జగనన్న ఆదుకున్నారు

ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరికి మద్దతు తెలిపిన ఎస్‌సి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు రూరల్ మండలానికి చెందిన ఎస్‌సి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భారీ బైక్ ర్యాలీగా కొండలరావు పాలెం క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి, దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి, రేపటి ఎన్నికల్లో తమ మద్దతు ఇస్తున్నట్లు స్వచ్ఛందంగా ప్రకటించారు. జగనన్న నాయకత్వంలో ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి ఏలూరు రూరల్ మండల ప్రాంత ప్రజలకు గతంలో ఎన్నడూ చూడని సంక్షేమాభివృద్ధిని అందించారని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు తొలగించి ఐక్యత తెచ్చారని వారు పేర్కొన్నారు. ఈ ప్రగతిని సుస్థిరం చేసుకోవాలన్న నిర్ణయంతో తామంతా కలిసి ఎంఎల్ఎను కలిసి రాబోయే ఎన్నికల్లో ఆయన్ని భారీ మెజారిటీతో గెలిపిస్తామని నాయకులు, కార్యకర్తలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి ఏలూరు రూరల్ మండల నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతూ జగనన్న ఆశీస్సులతో అందరి అభివృద్ధికి పాటుపడుతున్నానన్నారు. ఏ సమస్యలు వచ్చినా తాను పరిష్కరిస్తానని, ఎల్లప్పుడూ అందరికీ అండగా ఉంటానని హామీ ఇస్తూ, మరోసారి దెందులూరు గడ్డ మీద వైసిపి జెండాను ఎగరేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఎల్ఎ నాయకులు, కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు.